సాక్షి
యాదాద్రి భువనగిరి
సోమవారం : 27 : జనవరి 2025



కిడ్నీ రాకెట్ ప్రకంపనలు
కిడ్నీ మార్పిడి రాకెట్ నల్లగొండలోనూ ప్రకంపనలు సృష్టిస్తోంది. అరెస్టయిన వారిలో నలుగురు ఉన్నారు. - 8లో



స్వగ్రామానికి మృతదేహం
అమెరికాలో మృతిచెందిన కొయ్యల గూడెనికి చెందిన రవితేజ మృతదేహానికి అంత్యక్రియలు ముగిశాయి. - 8లో



అర్హులందరికీ పథకాలు
అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

పండుగలా పథకాలు ప్రారంభం

భువనగిరి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు సంక్షేమ పథకాలను ఆదివారం జిల్లాలో పండుగ వాతావరణంలో ప్రారంభించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నాలుగు సంక్షేమ పథకాలను అమలు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల పంపిణీని ఎంపిక చేసిన గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు లాంఛనంగా ప్రారంభించారు. 17 గ్రామాల్లో రైతుభరోసా 17,644, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా 329, రేషన్‌కార్డులు 910, ఇందిరమ్మ ఇళ్లు 1,144 మందికి మంజూరయ్యాయి. వారందరికీ మంజూరు పత్రాలు అందజేశారు.

ధర్మ సమాజ్ పార్టీ వినూత్న ప్రదర్శన

భువనగిరిటౌన్ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భువనగిరిలో భారత రాజ్యాంగ రథయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ ప్రతిమను రథంపై ఉంచి భారత రాజ్యాంగం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చూస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్ల నరేందర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమలైన తరువాతే మనుషులంతా సమానంగా చూడబడుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో రాజ్యాంగ ప్రతిమ, అంబేద్కర్ చిత్రపటం ఏర్పాటు చేయకుండానే జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం అంబేద్కర్‌ను అవమానించడమేనన్నారు. ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ యాదవ్, నాయకులు లింగస్వామి, గాలయ్య, శ్రీకాంత్, శాంతికుమార్, మహేష్, జంగయ్య, రవి, నవీన్, నర్సింగ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నీర్నెములవాసికి సేవా పతకం



కమాండెంట్ మురళీకృష్ణ చేతుల మీదుగా సేవాపతకం పొందుతున్న నర్సయ్య

రామన్నపేట : మండలంలోని నీర్నెముల గ్రామానికి చెందిన నోముల నర్సయ్య కేంద్ర ప్రభుత్వ ఉత్కృష్ట సేవాపతకం అందుకున్నారు. నర్సయ్య యూసుఫ్‌గూడ బెటాలియన్‌లో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన కేంద్ర హోంశాఖ ఉత్కృష్ట సేవాపతకానికి ఎంపిక చేసింది. ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా యూసుఫ్‌గూడ బెటాలియన్‌లో నిర్వహించి వేడుకల్లో కమాండెంట్ మురళీకృష్ణ పతకం ప్రదానం చేశారు.

రైతు మహాధర్నా ఏర్పాట్ల పరిశీలన

నల్లగొండ టూటౌన్ : హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 28న నల్లగొండలో నిర్వహించనున్న రైతుమహాధర్నా ఏర్పాట్లను ఆదివారం నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండలోని గడియారం సెంటర్ వద్ద మంగళవారం ఉదయం 11 నుంచి 2 గంటల వరకు ధర్నా ఉంటుందన్నారు. ఈ ధర్నాకు మాజీ మంత్రి కేటీఆర్ హాజరవుతున్నారని.. రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

• సంక్షేమం.. సంతోషం



వలిగొండ మండలం నాతాల్లగూడెంలో సంక్షేమ పథకాల మంజూరు పత్రాలు తీసుకుని సంతోషంగా వెళ్తున్న లబ్ధిదారులు

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హనుమంతరావు, చిత్రంలో డీసీపీ రాజేశ్‌చంద్ర

> ఆరు గ్యారంటీల ద్వారా యాదాద్రి భువనగిరి జిల్లాలో లక్షలాది మందికి లబ్ధి చేకూరుతోంది. తాజాగా అమల్లోకి వచ్చిన నాలుగు పథకాల ద్వారా మరింత మేలు జరగనుంది. రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ. జాబితాలో పేర్లు రాని వారు ఆందోళన చెందవద్దు.
>
> -కలెక్టర్ హనుమంతరావు



ప్రగతి నివేదిక చదువుతున్న కలెక్టర్ హనుమంతరావు, వేదికపై ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, డీసీపీ రాజేశ్‌చంద్ర, మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు

సాక్షి, యాదాద్రి : అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం సమ ప్రాధాన్యమిస్తుందని.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపరచడం, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు కలెక్టర్ హనుమంతరావు పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం భువనగిరిలోని జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన పరేడ్‌గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను వివరించారు. రుణమాఫీ ద్వారా రైతులంతా సంతోషంగా ఉన్నారని, సాగు యోగ్యమైన భూములకు రైతుభరోసా సాయం అందనుందని తెలిపారు. భారత రాజ్యాంగం అద్భుతమైనదని, ఎందరో వీరుల త్యాగఫలితం వల్లే స్వాతంత్ర్య ఫలాలు అనుభవిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర మహిళా అభివృద్ధి సంస్థ చైర్మన్ బండ్రు శోభారాణి, డీసీపీ రాజేశ్‌చంద్ర, ఏఎస్పీ రాహుల్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, గంగాధర్, జెడ్పీ సీఈఓ శోభారాణి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలతో లక్షలాది మందికి లబ్ధి
- కొత్తగా నాలుగు పథకాలు అమల్లోకి
- రుణమాఫీతో రైతుల్లో సంతోషం
- సాగు భూములకు రైతుభరోసా
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ హనుమంతరావు

కలెక్టర్ ప్రసంగంలోని ముఖ్యమైన అంశాలు
- ఆరు గ్యారంటీల్లో భాగంగా జిల్లా పరిధిలో ఆర్టీసీ బస్సుల్లో 1.50 కోట్ల మంది మహిళలు ప్రయాణించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.53.05 కోట్లు ఖర్చు చేసింది.
- మహాలక్ష్మి పథకం ద్వారా 1,24,899 మందికి 4,54,299 గ్యాస్ సిలిండర్లు అందజేసి రూ.13.96 కోట్ల సబ్సిడీ జమ చేసింది.
- గృహజ్యోతి ద్వారా 1,46,312 మందికి లబ్ధి జరిగింది. ప్రభుత్వం రూ.47 కోట్ల భరించింది.
- 498 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయి.
- సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా 2,60,766 కుటుంబాలను సర్వే చేసి ఆన్‌లైన్ చేశారు.
- 4,292 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతుంది. రైతులకు రూ.729 కోట్ల సబ్సిడీ మంజూరు చేశాం.
- బునాదిగాని కాలువ పనులకు రూ.266.65 కోట్లతో పాలనా ఆమోదం లభించింది. కొత్తగా 14,575 ఎకరాల ఆయకట్టు సాగులోకి రానుంది.
- వానాకాలం 1,171మంది రైతుల నుంచి 4,657 మెట్రిక్ టన్నుల సన్నధాన్యం సేకరించాం. బోనస్ రూ.2.6 కోట్లు చెల్లించాం.
- 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ కూలీలకు 24.73 లక్షల పనిదినాలు కల్పించాం. ఇందుకోసం రూ.78.10 కోట్లు ఖర్చు చేశాం.

4,46,380 మందికి నిరంతర విద్యుత్
4,46,380 మందికి నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నాం. 2024–25 సంవత్సరానికి డిసెంబర్ 31 వరకు కొత్తగా 2,336 కొత్త విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశాం. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు 101 యూనిట్ల లోపు సబ్సిడీ పథకం కింద 39,851 మందికి రూ.3 97 కోట్ల సబ్సిడీ మంజూరు చేశాం.

నాలుగు విడతల్లో రుణమాఫీ
రుణమాఫీ కింద మూడు విడతల్లో 68,584 మంది రైతులకు రూ.553.82కోట్లు మాఫీ అయ్యాయి.నాలుగో విడతలో 11,691 మందికి రూ.111.65 కోట్లు మాఫీ జరిగింది. సాగు భూములకు ఎకరానికి రూ.12 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమకానున్నాయి.





విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



మున్సిపాలిటీలకు ప్రత్యేకాధికారిగా గంగాధర్

- నేడు బాధ్యతల స్వీకరణ
- ముగిసిన పాలకవర్గాల పదవీకాలం



స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరిటౌన్ : మున్సిపాలిటీల్లో సోమవారం నుంచి ప్రత్యేక అధికారుల పాలన మొదలుకానుంది. ఈనెల 26వ తేదీన పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారులను నియమిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. యాదాద్రి జిల్లాలోని భువనగిరి, యాదగిరిగుట్ట, ఆలేరు, మోత్కూరు, భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్, మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆరు మున్సిపాలిటీలకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించారు. గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల అనంతరమే మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. అప్పటి వరకు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగనుంది.

మాజీలైన మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు
మున్సిపాలిటీలకు 2019 జనవరిలో ఎన్నికలు జరిగాయి. అదే నెలలో పాలకవర్గాలు కొలువుదీరాయి. ఈనెల 26వ తేదీ నాటికి పదవీకాలం పూర్తికావడంతో చైర్మన్లు, కౌన్సిలర్లు మాజీలు అయ్యారు. పట్టణ అభివృద్ధి, పాలనాపరమైన నిర్ణయాల్లో ఇకనుంచి వారి జోక్యం ఉండదు. ప్రత్యేక అధికారి అన్నీ తానే నడిపించనున్నారు.

మొదటి సమావేశం మున్సిపల్ కమిషనర్లతో..
ప్రత్యేక అధికారిగా నియామకమైన అదనపు కలెక్టర్ గంగాధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్లతో సమావేశమై ఆస్తిపన్ను, అభివృద్ధి పనులు, ఇతర విషయాలపై చర్చించే అవకాశం ఉంది.

బీసీకా, ఓసీకా..!

బీజేపీ జిల్లా అధ్యక్ష పదవికి త్రిముఖ పోటీ
- రాష్ట్ర నాయకత్వం వద్ద తీవ్ర ప్రయత్నాలు
- సామాజిక వర్గ సమీకరణలు పరిగనలోకి
- నల్లగొండతో ముడిపెడుతున్న అధిష్టానం

సాక్షి, యాదాద్రి : బీజేపీ జిల్లా నూతన సారథిగా ఎవరిని ఎంపిక చేయనున్నారు? బీసీ నేతకు ఇస్తారా.. ఓసీకి కట్టబెడుతారా? ఈ విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఉమ్మడి జిల్లాల అధ్యక్షుల సామాజిక వర్గాలతో ముడిపడి ఉందని, అక్కడ ఓసీలకు దక్కితే ఇక్కడ బీసీలకు ఇవ్వాలన్న చర్చ రాష్ట్ర నాయకత్వంలో నడుస్తున్నట్లు సమాచారం. కాగా అధ్యక్ష పదవికోసం పోటీపడుతున్న నేతలు ఎవరికి వారు ముమ్మర ప్రయత్నాల్లో ఉన్నారు.

పోటీ పడుతున్న నేతలు వీరే..
నూతన అధ్యక్షుడి ఎంపిక ఈనెల 16వ తేదీన పూర్తి చేయాల్సి ఉండగా పోటీ ఎక్కువగా ఉండడంతో జాప్యం జరుగుతోంది. ముందుగా ఏసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, పడాల శ్రీనివాస్, మాయ దశరథ, ఊట్కూరి అశోక్‌గౌడ్ అధ్యక్ష పదవికోసం పోటీ పడ్డారు. స్క్రీనింగ్ కమిటీ సమావేశం అనంతరం ఏసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, ఊట్కూరి అశోక్‌గౌడ్‌ల పేర్లను రాష్ట్ర నాయకత్వానికి పంపించారు. కాగా పడమటి జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర, రాష్ట్రస్థాయిలో తనకున్న పరిచయాలను ఉపయోగించుకుంటుండగా, ఏసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి రాష్ట్రస్థాయి నేతలతో పాటు సంఘ్ పరివార్ ద్వారా అధ్యక్ష పదవిని దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు బీసీ కోటాలో తనకు అవకాశం ఇవ్వాలంటూ ఊట్కూరి అశోక్‌గౌడ్ నాయకత్వాన్ని గట్టిగా కోరుతున్నాడు. అశోక్‌కు పార్టీలోని సీనియర్ నేతలతో పాటు పలువురు బీసీ నాయకుల మద్దతు ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

నల్లగొండతో..
యాదాద్రి భువనగిరి అధ్యక్షుడి నియామకం నల్లగొండ జిల్లా అధ్యక్షుడి నియామకంతో ముడిపడి ఉందని సమాచారం. నల్లగొండలో ఓసీలకు దక్కితే ఇక్కడ బీసీలకు ఇవ్వాలని.. బీసీకి ఇస్తే ఓసీకి దక్కే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా మంత్రులు, ఎంపీలు, రాష్ట్రస్థాయి నేతలు తమ అనుచరులకు అధ్యక్ష పదవులు ఇప్పించుకోవాలన్న పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో సామాజిక వర్గ సమీకరణలు పరిగణలోకి తీసుకుంటారా, అనుయాయులకు కట్టబెడతారా.. అన్న చర్చ జరుగుతోంది.

పథకాల అమలులో దేశానికే ఆదర్శం

- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ప్రొసీడింగ్స్ అందజేత



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల మంజూరు పత్రాలు అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

వలిగొండ : సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శమని భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం వలిగొండ మండలం నాతాళ్లగూడెంలో ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిల్ కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావుతో కలిసి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డు పథకాలను ప్రారంభించి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదల జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే ప్రభుత్వం లక్ష్యమని, అందులో భాగంగా ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల లోపు ఉచిత కరెంట్, సబ్సిడీ గ్యాస్ పథకాల అమలుతో పాటు రైతులకు రుణమాఫీ చేసిందని, ఆరోగ్యశ్రీ పథకం కింద గతంలో ఉన్న మొత్తాన్ని రూ.10లక్షలకు పెంచినట్లు పేర్కొన్నారు. తాజాగా మరో నాలుగు పథకాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. దేశంలోనే తెలంగాణలో రికార్డు స్థాయిలో ధాన్యం పండిందని, 155 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను కొనుగోలు చేశామన్నారు. సన్నాలు క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ప్రస్తుతం 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, వీటిలో 2.81 కోట్ల యూనిట్లు ఉన్నట్లు చెప్పారు. రేషన్‌కార్డుల జారీ పూర్తయిన తర్వాత యూనిట్‌కు నాణ్యమైన 6 కిలోల సన్న బియ్యం ఇస్తామన్నారు. తాము 24 గంటలు కష్టపడి నిజాయితీగా పనిచేస్తుంటే.. బీఆర్ఎస్ నాయకులు ఓడిపోయిన ఫ్రస్టేషన్‌లో అర్థరహితంగా మాట్లాడుతున్నరని విమర్శించారు.

సాగునీరు ఇవ్వడమే లక్ష్యం : ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి
నియోజకవర్గ రైతులందరికీ సాగునీరు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. సాగునీటి కాల్వలకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రూ.500 కోట్లు మంజూరు చేశారని, ఈ నిధులతో కాల్వల ఆధునీకరణ పూర్తి చేస్తామని చెప్పారు.

అర్హులందరికీ పథకాలు : ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి
ప్రజాపాలన గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ పథకాలు అందజేస్తామని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, డీఆర్డీఓ నాగిరెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, భువనగిరి, వలిగొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు రేఖ బాపురావు, భీమానాయక్, భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, మత్స్యగిరి ఆలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్‌రెడ్డి, ప్రత్యేకాధికారి జగన్నాథం, ఎంపీడీఓ జితేందర్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, పాశం సత్తిరెడ్డి, ఏట అంజనీదేవి తదితరులు పాల్గొన్నారు.

యాదగిరి నృసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూలు, ప్రతిష్టా అలంకారమూర్తులను నిజాభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు.ఇక ప్రథమ ప్రాకార మండపంలో పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు నిర్వహించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు చేపట్టారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవను ఆలయ మాడ వీధిలో ఊరేగించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రికి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పథకాలు మాకెందుకు రాలేదు?



మోత్కూరు మండలం పాటిమట్లలో ఆందోళనకు దిగిన దరఖాస్తుదారులు

- పాటిమట్ల, మంతపురిలో రసాభాసగా పథకాల ప్రారంభ సభలు
- ఆందోళనకు దిగిన దరఖాస్తుదారులు

మోత్కూరు, ఆలేరు రూరల్: మోత్కూరు మండలం పాటిమట్ల, ఆలేరు మండలంలోని మంతపురిలో ఆదివారం నిర్వహించిన సంక్షేమ పథకాల ప్రారంభ సభలు రసాభాసగా మారాయి. దరఖాస్తు చేసుకుని పథకాలు రాని వారు ఆందోళనకు దిగారు. పాటిమట్ల గ్రామంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన లబ్ధిదారుల పంపిణీ పత్రాల పంపిణీ కార్యక్రమంలో రేషన్ కార్డులు 71, ఇందిరమ్మ ఇళ్లు 90, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా 27, రైతు భరోసా 553 మందికి మంజూరు కాగా అధికారులు ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. ఈ క్రమంలో జాబితాలో పేర్లు రానివారు ఆందోళనకు దిగారు. తాము అర్హులైనప్పటికీ అన్యాయం చేశారంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు వచ్చి వారికి నచ్చజెప్పి పంపించారు.

మంతపురిలో..
ఆలేరు మండలం మంతపురిలో రైతుభరోసా 364, ఆత్మీయభరోసా 44, ఇందిరమ్మ ఇళ్లు 49, రేషన్ కార్డులు 73 మందికి మంజూరయ్యాయి. ఆలేరు మండల నోడల్ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేస్తుండగా పథకాలు రాని వారు ఆందోళన చేశారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగలేదని, అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని, అనర్హులని ఎంపిక చేశారని మండిపడ్డారు.



అధికారులను ప్రశ్నిస్తున్న దరఖాస్తుదారులు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

భువనగిరిటౌన్: భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. అదేవిధంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి, జిల్లా అటవీశాఖ, వైద్య ఆరోగ్య శాఖ, రోడ్డు రవాణ, జిల్లా విద్యాశాఖ, మాజింగ్ జిల్లా అగ్నిమాపక, విద్యుత్ శాఖ, జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శకటాల ప్రదర్శన నిర్వహించారు. జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలపై జిల్లా వ్యవసాయ, డీఆర్‌డీఓ, జిల్లా సంక్షేమం, మెప్మా, జిల్లా చేనేత శాఖ, మత్స్యశాఖ, తదితర శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. వీటిని కలెక్టర్ హనుమంతరావు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర మహిళా అభివృద్ధి సంస్థ చైర్మన్ బండ్రు శోభారాణి పరిశీలించారు. వారి వెంట భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి, ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ జగన్‌మోహన్ ప్రసాద్ ఉన్నారు.


సాంస్కృతి ప్రదర్శన చేసిన విద్యార్థులతో విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే కుంభం



మహిళా సంఘాల బ్యాంకు రుణాల చెక్కును అందజేస్తున్న విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే, కలెక్టర్


ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన స్టాల్


ఉచిత విద్యుత్ శకట ప్రదర్శన


గిరిజనుల సంప్రదాయ నృత్యం


పోలీస్ గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతరావు



క్లుప్తంగా

జాతీయ జెండాకు అవమానం


క్యాంపు కార్యాలయంపై తాడు తెగి వేలాడుతున్న జాతీయ జెండా

భువనగిరిటౌన్: భువనగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాకు అవమానం జరిగింది. కార్యాలయంపై స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేసి వెళ్లిపోయారు. తాడు సరిగ్గా లేకపోవడంతో తెగిపోయి జెండా వేలాడుతోంది. అటు నుంచి వెళ్తున్న విద్యార్థినులు జెండాను సరిచేశారు. ఎస్ఐ కుమారస్వామి వారికి సహకరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మిర్యాలగూడ: రోడ్డు దాటుతున్న వ్యక్తిని బొలేరో వాహనం ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన దామరచర్ల మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం దామరచర్ల మండల కేంద్రానికి చెందిన వీర్ల కోటయ్య(55) నడుచుకుంటూ మండల కేంద్రంలోని వీర్లపాలెం రోడ్డు దాటుతుండగా బోలేరో వాహనం ఢీకొట్టింది. కోటయ్య తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కోటయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న కుమారుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యా సామర్థ్యాల పెంపే లక్ష్యం

ఉపకరణాలతో విద్యాబోధన
- జిల్లాకు 138 కిట్లు మంజూరు
- ఎంపిక చేసిన పాఠశాలకు అందజేత


ప్రధానోపాధ్యాయుడికి బోధనోపకరణాల కిట్ అందజేస్తున్న డీఈఓ సత్యనారాయణ

భువనగిరి : విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు ఎఫ్ఎల్ఎన్(తొలిమెట్టు) కార్యక్రమంలో భాగంగా రెండేళ్లుగా ప్రభుత్వ పాఠశాలలకు విద్యాశాఖ బోధనోపకరణాలు అందిస్తోంది. దీనిని మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టింది. విద్య, వినోదంతో కూడిన బోధన అందజేయాలని నిర్ణయించింది. ఇందుకోసం గుజరాత్‌లోని గాంధీనగర్ ఐఐటీ వారు రూపొందించిన బోధనోపకరణాల కిట్లను జిల్లాకు సరఫరా చేసింది. వీటిని ప్రధానోపాధ్యాయులకు అందజేస్తున్నారు.

ప్రయోజనాలు ఇవీ..

జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు 715 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 49,542 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు తొలిమెట్టు, ఉన్నత పాఠశాలల్లో ఉన్నతి కార్యక్రమం అమలు చేస్తున్నారు. అయినా విద్యార్థుల్లో ఆశించినస్థాయిలో సామర్థ్యాలు మెరుగుపడటం లేదు. ఈ నేపథ్యంలో బోధనోపకరణాలతో బోధన అందించడానికి ప్రాథమిక పాఠశాలల వారికి ఎఫ్ఎల్ఎన్(తొలిమెట్టు) వండర్ బాక్సులు, ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు గణిత, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఖోజీ బాక్సులు, కేజీబీవీలకు క్యూరియాసిటి గణిత, సైన్సు బాక్సులు అందజేస్తున్నారు. ఇప్పటికే వండర్, క్యూరియాసిటి బాక్సులు వచ్చాయి. 113 ప్రాథమిక, 14 ఉన్నత, 11 కేజీబీవీ పాఠశాలలకు బోధనోపకరణాలు మంజూరయ్యాయి.

సామర్థ్యాలు మెరుగుపడుతాయి

జిల్లాకు 138 కిట్లు మంజూరయ్యాయి. ఇందులో ప్రాథమిక, కేజీబీవీ పాఠశాలలకు వచ్చిన బాక్సులను పంపిణీ చేస్తున్నాం. ఉన్నత పాఠశాలలకు సంబంధించి ఖోజీ బాక్సులు రావాల్సి ఉంది. ఈ బాక్సులు రాగానే పాఠశాలలకు అందజేస్తాం. బోధనోపకరణాల వల్ల విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు మెరుగుపడే అవకాశం ఉంటుంది. వీటి ద్వారా ఉపాధ్యాయులు బోధన చేయాల్సి ఉంటుంది.

– సత్యనారాయణ, డీఈఓ

పక్కాగా అమలైతేనే..

బోధనోపకరణాల కిట్లను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటనే మెరుగైన ఫలితాలు రానున్నాయి. గతంలో సమగ్ర శిక్ష ద్వారా అందజేసిన గణిత, సైన్స్ కిట్లను వినియోగించడం లేదు. పర్యవేక్షణ లేకపోవడంతో కిట్లు నిరుపయోగంగా ఉన్న పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో వివిధ రకాల బాక్సులు అందజేస్తున్న విద్యాశాఖ.. వాటి వినియోగంపైనా పర్యవేక్షణ చేయవల్సిన అవసరం ఉంటుంది.

ఎమ్మెల్యే ఫొటో పెట్టలేదని ఫ్లెక్సీల తొలగింపు


భువనగిరి ఎమ్మెల్యే ఫొటో పెట్టలేదని తొలగించిన ఫ్లెక్సీ

భువనగిరిటౌన్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా డీసీసీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆలేరు, భువనగిరి నియోజకవర్గం ఎమ్మెల్యేలతో పాటు, వారి వర్గీయులు పాల్గొన్నారు. ఈ క్రమంలో మోటకొండూరు కాంగ్రెస్ శ్రేణులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఫొటోలు మాత్రమే ఉన్నాయని భువనగిరి పట్టణ కాంగ్రెస్ శ్రేణులు ఆరోపించారు. డీసీసీ అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో సైతం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఫొటోలు ప్రాధాన్యత లేకుండా చిన్నగా వేశారని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆగ్రహానికి గురైన కాంగ్రెస్ కార్యకర్తలు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ధ్వంసం చేశారు.

విజయ్‌కుమార్‌కు బెస్ట్ ఎన్‌రోల్‌మెంట్ ప్రాక్టీస్ అవార్డు

నల్లగొండ: ఓటర్ల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతులమీదుగా నల్లగొండ కలెక్టరేట్‌లోని ఎలక్షన్ సెల్‌లో నాయబ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎం. విజయ్‌కుమార్ బెస్ట్ ఎన్‌రోల్‌మెంట్ ప్రాక్టీస్ అవార్డు అందుకున్నారు. ఓటర్ల జాబితా తయారీలో కీలకపాత్ర వహించినందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఎలక్షన్ కమిషన్ అవార్డులను ప్రకటించింది. అందులో నల్లగొండ నుంచి విజయ్‌కుమార్‌కు అవార్డు అందజేశారు.

ఢిల్లీలోని గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న అమరవరపు సతీష్


అమరవరపు సతీష్

గరిడేపల్లి: దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు అమవరపు సతీష్ పాల్గొన్నారు. తనకు గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు అవకాశం రావడంతో ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత అందె భాస్కర్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణకు సతీష్ కృతజ్ఞతలు తెలిపారు.

స్వగ్రామానికి రవితేజ మృతదేహం

- కొయ్యలగూడెంలో ముగిసిన అంత్యక్రియలు


రవితేజ అంత్యక్రియల్లో పాల్గొన్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్: అమెరికాలో గుర్తుతెలియని దుండగుల కాల్పుల్లో మృతిచెందిన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన కొయ్యడ రవితేజ(26) మృతదేహం వారం రోజుల తర్వాత ఆదివారం తెల్లవారుజామున స్వగ్రామానికి చేరుకుంది. బంధువులు, కుటుంబ సభ్యులు, స్నేహితుల అశ్రునయనాల మధ్య రవితేజ అంత్యక్రియలు సాయంత్రం ముగిశాయి. 'గొప్పోడివై మమ్ములను చూస్తావనుకున్న బిడ్డా..' అంటూ రవితేజ మృతదేహం చూసి అతడి తల్లి బోరున విలపించిన తీరు అందరినీ కలచివేసింది.

నివాళులర్పించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

రవితేజ భౌతికకాయానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రవితేజ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. రవితేజ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. బీజేపీ నేత మనోహర్‌రెడ్డి కూడా రవితేజ భౌతికకాయానికి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.


గణతంత్ర వేడుకల్లో కార్డియాక్ స్ట్రోక్

నల్లగొండ టౌన్: నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొనడానికి వచ్చిన పబ్లిక్ హెల్త్ డిప్యూటీ టెక్నికల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఆజమ్‌కు కార్డియాక్ స్ట్రోక్ వచ్చింది. ఆ సమయంలో అక్కడే ఉన్న డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్ స్పందించి ఆజమ్‌కు సీపీఆర్ చేసి నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆజమ్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్య సిబ్బంది తెలిపారు.

కుమార్తెతో కలిసి మహిళ అదృశ్యం

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామానికి మహిళ తన కుమార్తెతో కలిసి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దండు మల్కాపురం గ్రామానికి చెందిన మహ్మద్ అజాంఖాన్‌కు అదే గ్రామానికి చెందిన షేక్ అఫ్రీన్‌తో 2013లో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అజాంఖాన్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 25వ తేదీన అజాంఖాన్ కూలీ పని వెళ్లగా.. అతడి భార్య షేక్ అఫ్రీన్ కుమార్తెను తీసుకొని బయటకు వెళ్తున్నానని అత్తతో చెప్పి వెళ్లింది. రాత్రి అయినా కూడా అఫ్రీన్ ఇంటికి రాకపోయేసరికి అజాంఖాన్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

సేవకు వీడ్కోలు ఉండదు


మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులతో విప్ ఐలయ్య

యాదగిరిగుట్ట : రాజకీయంగా వచ్చిన పదవులకు వీడ్కోలు ఉంటాయి తప్ప.. సేవలకు వీడ్కోలు ఉండదని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. యాదగిరిగుట్ట మున్సిపల్ పాలక వర్గం ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని చైర్‌పర్సన్ ఎరుకల సుధా, వైస్ చైర్మన్ కాటంరాజు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు గౌళికార్ అరుణ, బూడిద సురేందర్, సీస విజయలక్ష్మీ, గుండ్లపల్లి వాణి, బిట్టు సరోజ, ముక్కెర్ల మల్లేష్, దండబోయిన అనిల్, ఆవుల మమత, తాళ్లపల్లి నాగరాజు, బబ్బూరి మౌనిక, కో ఆప్షన్ సభ్యులున్నారు.

యాదగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ


ఆలయ ఉత్తర మాడ వీధిలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. గణతంత్ర దినోత్సవంతో పాటు ఆదివారం సెలవురోజు కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధికంగా తరలివచ్చారు. ధర్మ దర్శనానికి 3గంటలకు పైగా సమయం పట్టగా.. వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. భక్తులు అధికంగా రావడంతో ఆలయ పరిసరాలు, క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, మెట్ల దారి, కొండ కింద శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం, కల్యాణ కట్ట, లక్ష్మీపుష్కరిణి, ఆర్టీసీ బస్టాండ్ వంటి ప్రాంతాల్లో భక్తులు అధికంగా కనిపించారు. స్వామివారిని 30వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి ఆలయానికి నిత్యాదాయం రూ.39,45,629 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తాం

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ దశల వారీగా అందజేస్తామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం మసీదుగూడెం గ్రామంలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తామని చెప్పి మోసం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వ ఆర్థిక విధానం వల్ల రాష్ట్రం అప్పుల పాలయ్యిందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని స్పష్టం చేశారు. కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీఓ వి.శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ హరికృష్ణ, మండల ప్రత్యేకాధికారి రవీందర్, ఎంపీడీఓ సందీప్‌కుమార్, మండల వ్యవసాయాధికారి ముత్యాల నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పబ్బు రాజుగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి, మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, బక్క శ్రీనాథ్, మల్లికార్జున్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కిడ్నీ రాకెట్ ప్రకంపనలు

- హైదరాబాద్‌లో అరెస్టయిన వారిలో నలుగురు నల్లగొండ వాసులే
- అలకనంద ఆస్పత్రిలో మెడికల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఆ నలుగురు
- తాజా ఉదంతంతో తెరపైకి 2016 నాటి కిడ్నీ మార్పిడి వ్యవహారం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన కిడ్నీ మార్పిడి రాకెట్ సంఘటన నల్లగొండలో ప్రకంపనలు సృష్టిస్తోంది. హైదరాబాద్ సరూర్‌నగర్‌లోని అలకనంద ఆస్పత్రిలో కిడ్నీ రాకెట్‌లో అరెస్టయిన వారిలో నల్లగొండకు చెందిన నలుగురు మెడికల్ అసిస్టెంట్లు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. 2016లో నల్లగొండలో జరిగిన కిడ్నీ రాకెట్ సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. ఆ రాకెట్‌లో జిల్లా కేంద్రానికి చెందిన యువకుడు డబ్బుల కోసం కిడ్నీ అమ్ముకొని, చివరికి అతనే ఏజెంట్‌గా మారాడు. ఆ సంగతి మరచిపోతున్న తరుణంలో ఇప్పుడు మళ్లీ హైదరాబాద్‌లో కిడ్నీ మార్పిడి రాకెట్ బయటపడింది. ఈ కేసును ఛేదించిన పోలీసులు ఆస్పత్రి వైద్యుడితోపాటు అందులో భాగస్వాములైన సిబ్బందిని అరెస్టు చేశారు. వారిలో అదే ఆస్పత్రిలో మెడికల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న నల్లగొండ జిల్లాకు చెందిన నలుగురు వ్యక్తులు ఉండటంతో జిల్లాలో కిడ్నీ రాకెట్ ప్రకంపనలు మొదలయ్యాయి.

ఐదుగురిలో.. నలుగురు నల్లగొండ వారే

హైదరాబాద్‌లోని అలకనంద ఆస్పత్రిలో ఏడు నెలలుగా చట్టవిరుద్ధంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేస్తున్న కేసులో రాచకొండ ఎస్ఓటీ పోలీసులు శనివారం పలువురిని అరెస్టు చేశారు. అందులో అలకనంద ఆసుపత్రి ఎండీ గంటుపల్లి సురేష్, డాక్టర్ సిద్ధంశెట్టి అవినాష్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ సోహిబ్‌ను అరెస్టు చేశారు. వారితోపాటు మెడికల్ అసిస్టెంట్లు ఐదుగురిని అరెస్టు చేశారు. వారిలో ఆస్పత్రి రిసెప్షనిస్ట్ నర్సగాని గోపి మినహా మిగతా నలుగురు నల్లగొండ జిల్లాకు చెందినవారే ఉన్నారు. వారిలో నల్లగొండలో నివాసం ఉంటున్న రమావత్ రవి, సపావత్ రవీందర్, సపావత్ హరీష్, పొదిల సాయి ఉన్నారు. వారంతా ఈ కిడ్నీ మార్పిడి రాకెట్‌లో అరెస్టు కావడంతో నల్లగొండ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

మెడికల్ అసిస్టెంట్లేనా?

నల్లగొండకు చెందిన వారు కిడ్నీ మార్పిడి వ్యవహారంలో కేవలం మెడికల్ అసిస్టెంట్లుగా వ్యవహరించారా? పొట్టకూటి కోసమే అక్కడ ఉద్యోగంలో చేరారా? అన్నది తేలాల్సి ఉందన్న చర్చ సాగుతోంది. ఈ రాకెట్‌లో వారి పాత్ర ఏంటన్న దానిపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నల్లగొండ జిల్లా నుంచి కూడా కిడ్నీ విక్రయాలు జరిగాయా? అన్న సందేహం కలుగుతోంది. జిల్లా పోలీసులు కూడా ఈ అంశంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. పాత కేసుతో వీరికి ఏమైనా సంబంధం ఉందా? అన్న కోణంలో పరిశీలన జరిపి.. ప్రస్తుతం అరెస్టయిన వారికి అప్పటి కేసుతో సంబంధం లేదని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు సమాచారం. తాజా కేసులో జిల్లా నుంచి కిడ్నీలు అమ్ముకునే దాతలను వీరు ఏమైనా సంప్రదించారా? అనే అంశంపై దృష్టి సారించినట్లు సమాచారం.

2016లో ఎలా జరిగిందంటే..

దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నల్లగొండలో కిడ్నీ మార్పిడి రాకెట్ 2016 జనవరిలో బయటపడింది. నల్లగొండకు చెందిన సురేష్ అనే యువకుడు హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేస్తున్నాడు. అతని అవసరాలకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నాడు. అదే క్రమంలో ఆన్‌లైన్‌లో కిడ్నీదాతలు కావాలనే ప్రకటనతో అతను వారితో మాట్లాడి తాను కిడ్నీ ఇస్తానని ఒప్పుకున్నాడు. ఆ తరువాత ముంబైకి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్నాడు. ఆ తరువాత ప్రధాన ఏజెంట్లు అతన్ని శ్రీలంకలోని కొలంబోలోని వెస్టర్న్ ఆస్పత్రికి తీసుకెళ్లి అక్కడి దాతకు కిడ్నీ ఇచ్చాడు. అందుకుగాను రూ.5 లక్షలు వారి నుంచి సురేష్ తీసుకున్నాడు.

బాధితుడి నుంచి ఏజెంట్‌గా..

మొదట ఆర్థిక అవసరాలం కోసం కిడ్నీ అమ్ముకున్న సురేష్‌కు కిడ్నీల వ్యాపారం ద్వారా డబ్బు సంపాదించాలనే ఆలోచన వచ్చింది. తనకు పరిచయమున్న వారిని డబ్బు ఆశ చూపెట్టి కిడ్నీల వ్యాపారానికి తెరతీశాడు. ఇదే క్రమంలో నల్లగొండలో సస్పెండ్ అయిన ఉద్యోగి పరిచయం కావడం, అతడి కిడ్నీ కూడా విక్రయించేలా ఒప్పించాడు. కిడ్నీ ఇచ్చినందుకు బాధితుడికి రూ.5 లక్షలు, ఏజెంట్‌గా సురేష్‌కు రూ.50 వేలు ఇచ్చారు. ఇలా నల్లగొండ జిల్లాలో ముగ్గురు, హైదరాబాద్‌లో నలుగురు, బెంగుళూరులో నలుగురు, తమిళనాడులో ఇద్దరు కిడ్నీలు ఇచ్చేలా ఒప్పించి కమీషన్ పొందాడు. సోషల్ మీడియా ద్వారా కిడ్నీల వ్యాపారాన్ని ఢిల్లీ, అహ్మదాబాద్ తదితర ప్రాంతాలకు విస్తరించాడు. ఈ వ్యవహారం నల్లగొండ పోలీసులకు చేరడంతో అప్పటి ఎస్పీ విక్రమ్‌జిత్ దుగ్గల్ ఆదేశాల మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. నల్లగొండలో సురేష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా 2014 నుంచే ఈ కిడ్నీ మార్పిడి రాకెట్ జరిగినట్లు బయటపడింది. కిడ్నీలు అమ్ముకునే వారికి ముంబైలో వైద్య పరీక్షలు నిర్వహించి, కొలంబోలోని వెస్టర్న్, నవలోక్ ఆస్పత్రుల్లో కిడ్నీల మార్పిడి చేశారు. ఈ వ్యవహారంలో విదేశీ డాక్టర్లు కూడా ఉండటం గమనార్హం.

యువకుల హల్‌చల్

- జాతీయ జెండాలతో బైక్‌లు, కార్లపై విన్యాసాలు
- భయభ్రాంతులకు గురైన కోదాడ వాసులు

కోదాడ: కోదాడ పట్టణంలో ఆదివారం కొంతమంది యువకులు హల్‌చల్ చేశారు. ఒక్కో బైక్‌పై ముగ్గురు నలుగురు కూర్చొని సైలెన్సర్లు తీసివేసి భారీ శబ్దం చేసుకుంటూ జాతీయ జెండాలను పట్టుకొని పట్టణంలోని ప్రధాన రహదారిపై విన్యాసాలు చేశారు. మరికొందరు జాతీయ జెండాలను ఇష్టమొచ్చినట్లు కార్లకు కట్టి ర్యాలీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ల ముందు నుంచే ఈ ర్యాలీలు నిర్వహించినా పోలీసులు వారిని వారించే ప్రయత్నం చేయకపోవడం గమనించదగ్గ విషయం. ఈ ర్యాలీలతో పట్టణవాసులు భయభ్రాంతులకు గురయ్యారు. పలుచోట్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. యువకులు ర్యాలీలు ముగించుకొని ఎంఎస్ కళాశాల వద్దకు వెళ్తున్న సమయంలో ఇద్దరు పోలీసులు వచ్చి వారిని అదుపులోకి తీసుకొనేందుకు ప్రయత్నించగా.. వారిని లెక్క చేయకుండా యువకులంతా అక్కడి నుంచి వెళ్లిపోయారు.